# మొదటి క్లయింట్



పరీక్షలు అయిపోయాయి.

కాలేజీకి సెలవులు ఇచ్చేశారు. సుందరం వాళ్ళ ఊరు వెళ్లడానికి సామాను సర్దుకుంటున్నాడు. వాణ్ణి చూద్దామని, వాడి రూంకి వెళ్లాను.

“రా..రా..! మంచి సమయానికే వచ్చావు. నేనే నీ దగ్గరకి వద్దామనుకుంటున్నాను” అన్నాడు సుందరం నన్ను చూస్తూనే.

“ఏమిటి సంగతి..?” అన్నాను నేను నవ్వుతూ.

"ఏంలేదు. నువ్వు కూడా మీ ఊరు వెళ్తున్నావు కదా?" అని జవాబు చెప్పడానికి బదులు, ప్రశ్న వేశాడు.

"అవును" అన్నాను.

"నువ్వు కూడా మా ఊరు రావొచ్చుదూ? నాలుగు రోజులుండి మీ ఊరు వెళ్లవచ్చు. నువ్వెప్పుడూ మా ఊరు చూడలేదు కూడాను!" అన్నాడు సుందరం.

"ఏం... నాలుగు రోజులకంటే ఎక్కువ ఉండకూడదా?" అన్నాను పరిహాసంగా.

"చాల్లే... బోడి సరసం! ఇంతకీ వస్తావా... లాక్కెళ్లమంటావా?"

"లాగడం మొదలెడితే ఎవరు ఎటు వెళ్తారో కాని, మీ ఊరి తోటకూర కాడలతో కూర చేసిపెట్టి.., లడ్డూ, హల్వా, పకోడీలతో రోజూ టిఫిన్ పెట్తానంటే వస్తాను."

"ఇంతేకదా! మొత్తంమీద జూనియర్ బకాసురుడు అని నిరూపించుకో దల్చుకున్నావు. సరేరా... చాలు మొర్రో అనేదాకా పెట్తాను."

"ఓ.కె. అయితే నేను రెడీ! డైరెక్ట్‌గా స్టేషన్‌కి వచ్చి కల్సుకుంటాను" అంటూ సెలవు తీసుకున్నాను.

సుందరం వాళ్ల ఊరు- పేరుప్రఖ్యాతులున్న పట్టణమే.

ఒకప్పుడు బాగా బ్రతికినా, ఇప్పుడు ఎవరూ పట్టించుకోకపోవడంతో... పాతని వదల్చుకోలేక, కొత్తని తెచ్చుకోలేక- కలత నిద్రపోయే మనిషిలాగా, మినుకు మినుకుమనే ఆముదం దీపంలాగా ఉంది ఆ ఊరు. ఆధునికమైన కట్టడాలు చెప్పుకోదగ్గవి ఏమీ లేకపోయినా, చారిత్రక ప్రాధాన్యంగల అవశేషాలు చాలా ఉన్నాయి ఆ ఊళ్లో.

ఆ సాయంత్రం... నేనూ, సుందరం ఊళ్లో షికారుకి బయలుదేరాం.

అలా అలా కబుర్లు చెప్పుకుంటూ వెళ్తూ, ఊరికి ఒక చివరికి వెళ్లాం. అక్కడ రెండు పెద్ద పెద్ద చెరువులు ఉన్నాయి. ఊరికి మంచినీటి సప్లయికోసం, బ్రిటిష్ ప్రభుత్వం ఏనాడో వాటిని నిర్మించింది. అందుకే వాటిని 'పంపుల చెరువు' అంటారు. అక్కడి దృశ్యం చాలా మనోజ్ఞంగా ఉంది. ఆ చెరువులకి ఎదురుగా ఒక పెద్ద కోనేరు, దాని ఒడ్డునే సుబ్రహ్మణ్యుని గుడి, దక్షిణ భారత సంప్రదాయ రీతిలో ఉన్నాయి.

నేనూ, సుందరం ఆ కోనేరు ఒడ్డున కూర్చొని మాట్లాడుకోసాగాం. ఆ కోనేరుకి కొంచెం దూరంలో, రెండు మూడు చోట్ల ఏవో మంటలు కనిపించాయి. అవి ఏమిటని అడిగాను.

"మనం ఇప్పుడున్నది - సాక్షాత్తూ స్మశానం ప్రక్కన. ఆ కనిపించే మంటలు... శవాల చితులు! ఏం చిట్టిబాబూ... భయపడ్తున్నావా?" అన్నాడు సుందరం నవ్వుతూ.

"చచ్చినవాళ్ళంటే నాకెప్పుడూ భయం లేదు. బ్రతికున్నవాళ్ళంటేనే నాకు భయం. అదిసరేగాని- ఆ సిమెంటు డాబా ఏమిటి? స్మశానంలో దయ్యాలకి విశ్రాంతి గృహమా ఏమిటి?" అన్నాను నవ్వుతూ కోనేటికి ఆవలివైపున ఉన్న కట్టడాన్ని చూపిస్తూ.

దాన్ని చూస్తూ సుందరం బరువుగా నిట్టూర్చాడు. ఒక్కక్షణం ఆగి చెప్పడం మొదలుపెట్టాడు-


"అది ఒక విషాదగాధరా! అది వింటే జాలివేస్తుంది- నవ్వూ వస్తుంది. ఒక దశాబ్దం క్రిందట ఈ ఊళ్లో ఒక లక్షాధిపతి ఉండేవాడు. ఆయన ధనాన్ని ఎన్ని అక్రమ మార్గాల ద్వారా ఆర్జించినా, దానధర్మాలు కూడా ఘనంగానే చేసేవాడు. ఇక్కడ స్మశానం చూస్తున్నావు కదా... ఇక్కడ చనిపోయినవారికి 'ధర్మోదకాలు' ఇచ్చేందుకు అనేకమంది స్త్రీ పురుషులు వస్తుండేవారు. ఆడవారికి, ఈ కోనేరులో స్నానం చేసి బట్టలు మార్చుకోవడానికి ఇబ్బందిగా ఉండేది. అందుచేత, వాళ్ళ సౌకర్యం కోసం ఆ ధార్మికుడు ఈ సిమెంటు డాబాని కట్టించాడు. ఇక్కడ, విధవ స్త్రీలకి మృతుని కర్మానంతరం 'ఉపకర్మలు' చేయడానికి వీలుగా ఉంటుందని భావించాడు. అయితే..." అంటూ చెప్పడం ఆపాడు సుందరం.

"అయితే ఏమైంది..?" అంటూ ఆత్రంగా అడిగాను.

"ఏముందీ... అది కట్టిన వేళావిశేషమేమిటోగాని, కట్టిన వెంటనే ఆ ధార్మికుడు మరణించాడు అకస్మాత్తుగా. ఈ డాబాలో మొట్టమొదటిసారిగా అపర సంస్కారాలు చేయబడ్డ విధవ ఆయన భార్య అయింది. ఆమే మొదటి క్లయింట్!" అన్నాడు సుందరం భారంగా.

ఆ మాటలు విని నేను నివ్వెరబోయాను. చితుల్లో మండుతున్న మంటలు, ఆ ఘోరానికి వికటాట్టహాసం చేస్తున్నట్లనిపించింది.

*- భారత మిత్రం... 21 ఆగస్ట్ '77*



**<u>అదే నా బాధ..!</u>**

రతి : చూడు మదన్... నా భర్త మరో అరగంటలో వచ్చేస్తాడు.

మదన్ : రానీ... నేనేమీ చేయకూడని పని చేయడం లేదే..!

రతి : అదే నా బాధ! అదేదో త్వరగా కానిచ్చి ఆయన వచ్చేలోగా బయటకు చెక్కేయి.